క్లుప్తంగా

వీఆర్‌ఏలకు పే స్కేల్ అమలు చేయాలి..



తహసీల్దార్ సురేష్‌కు వినతిపత్రం అందజేస్తున్న వీఆర్‌ఏలు

భోగాపురం: వీఆర్‌ఏ కుటుంబాలను అదుకునేందుకు పక్క రాష్ట్రం తెలంగాణలో అమలవుతున్న పే స్కేల్‌ను మన రాష్ట్రంలో కూడా వీఆర్‌ఏలకు అమలు చేయాలని పలువురు కోరారు. ఈ మేరకు శనివారం స్థానిక తహసీల్దార్ కార్యాలయం ఆవరణలో నిరసన వ్యక్తం చేశారు. నిబంధనలకు విరుద్ధంగా వీఆర్‌ఏలకు వేస్తున్న డ్యూటీలను రద్దు చేయాలని కోరారు. నైట్ వాచ్‌మన్, రికార్డు అసిస్టెంట్, ఇసుక డ్యూటీలు వేయకుండా... అర్హులైన వారి తో వీఆర్‌ఓ, అటెండర్, వాచ్‌మన్, రికార్డు అసిస్టెంట్, డ్రైవర్ వంటి ఖాళీ పోస్టులను భర్తీ చేయాలని కోరారు. అనంతరం తహసీల్దార్ సురేష్‌కు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో వీఆర్‌ఏలు గుడివాడ సరోజిని, గొర్ల పాపయ్యమ్మ, గొర్ల చంద్రరావు, దోలా నారాయణరావు, జి. శ్రీనివాసరావు, పి. తులసీదేవి, తదితరులు పాల్గొన్నారు.

రౌడీషీటర్లకు కౌన్సెలింగ్

విజయనగరం క్రైమ్: జిల్లా వ్యాప్తంగా వివిధ పోలీస్‌స్టేషన్ల పరిధిలో రౌడీషీట్ కలిగిన వ్యక్తులకు పోలీసులు శనివారం కౌన్సెలింగ్ నిర్వహించారు. ఎస్పీ వకుల్ జిందాల్ ఆదేశాల మేరకు ఆయా పోలీస్‌స్టేషన్లలో ఎస్సైలు, సీఐలు మాట్లాడుతూ, సత్ప్రవర్తనతో మెలగాలని సూచించారు. నేర ప్రవృత్తిని విడనాడకుంటే చర్యలు తప్పవన్నారు.

గిరిశిఖర మారిక గ్రామ రోడ్డు పరిశీలన



మారిక గ్రామరోడ్డును పరిశీలిస్తున్న అధికారులు

వేపాడ: మండలంలోని కరకవలస పంచాయతీ శివారు గిరిశిఖర మారిక గ్రామం రోడ్డును పీఆర్‌పీఐయూ డీఈ సత్యనారాయణమూర్తి, శనివా రం పరిశీలించారు. ప్రధానమంత్రి గ్రామ సడక్ యోజన పథకంలో భాగంగా మారిక గ్రామానికి మంజూరైన రోడ్డు పనులు నిలిచిపోవడంతో గిరిజనులు ఇటీవల కలెక్టరేట్‌లో ఫిర్యాదు చేశారు. కలెక్టర్ ఆదేశాలమేరకు డీఈ, ఇతర అధికారులు రోడ్డును పరిశీలించి, స్థానికులతో మాట్లా డారు. వర్షాకాలం వల్ల పనులు నిలిచి పోయాయని, ఫారెస్టు అధికారులకు సమాచారం ఇచ్చి త్వరలో పనులు ప్రారంభిస్తామని గిరిజనులకు అధికారులు చెప్పారు. డీఈ వెంట పీఆర్‌పీఐయూ జేఈ ఐశ్వర్య, గ్రామపెద్దలు జి.భారతి, సూర్యం ఉన్నారు.

పెదమానాపురంలో పశుగణన



పశుగణనను పరిశీలిస్తున్న జె.డి వైవీ రమణ

దత్తిరాజేరు: మండలంలోని పెదమానాపురం గ్రామంలో పశువైద్య సిబ్బంది ఆధ్వర్యంలో శనివారం పశుగణన నిర్వహించారు. కార్యక్రమాన్ని జిల్లా పశుసంవర్ధకశాఖ జేడీ వై.వి.రమణ పరిశీలించారు. పశు వైద్యాధికారి దినేష్‌తో కలిసి అఖిల భారత 21వ పశుగణనకు సంబంధించిన వాల్‌పోస్టర్లను ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ పశుగణన కార్యక్రమాన్ని పాడి రైతులు సద్వినియో గం చేసుకోవాలని సూచించారు. 2025 ఫిబ్రవరి 28వ తేదీ వరకు పశుగణన కొనసాగుతుందని, ఎన్యూమరేటర్లు, సూపర్ వైజర్లు గ్రామాల్లో ఇంటింటికీ వచ్చి పశువుల సమాచారాన్ని సేకరిస్తారని, వారికి పాడి రైతులు సహకరించాలని కోరారు.

కేజీబీవీ సందర్శన



స్టాక్ రూమ్‌లో కూరగాయలు, వంటసామాన్లను పరిశీలిస్తున్న ఎంఈఓ-2 బాలభాస్కరరావు

వేపాడ: బక్కునాయుడుపేట గ్రామంలోని కస్తూర్బా గాంధీ బాలిక విద్యాలయాన్ని(కేజీబీవీ) ఎంఈఓ-2 బాలభాస్కరరావు శనివారం సందర్శించారు. విద్యార్థినుల తో మాట్లాడి వసతులు, సమస్యలపై ఆరాతీశారు. పబ్లిక్ పరీక్షలకు సన్నద్ధతపై పదోతరగతి విద్యార్థినులకు సూచనలు చేశారు.శతశాతం ఉత్తీర్ణత సాధించి పాఠశాలకు మంచిపేరు తేవాలన్నారు. చదువులో వెనుకబడిన విద్యార్థినులపై ప్రత్యేక శ్రద్ధ చూపాలని ఉపాధ్యాయినులకు సూచించారు. అనంతరం వంటశాల, స్టాకు రూమ్‌లో స్టాకును పరిశీలించారు.

రైతు సేవలకు గ్రహణం..



భోగాపురం మండలం సవరవిల్లి రైతు సేవాకేంద్రం

- వెలవెలబోతున్న రైతుసేవా కేంద్రాలు
- అలంకార ప్రాయంగా కియోస్కో యంత్రాలు
- అరకొరగా ఎరువులు, పురుగు మందుల పంపిణీ
- ప్రైవేట్ దుకాణాల్లో అధిక ధరలకు కొనుగోలు చేస్తున్న రైతులు

పూసపాటిరేగ: గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో రైతుభరోసా కేంద్రాల ద్వారా రైతులకు ఎరువులు, పురుగు మందులు, వ్యవసాయ పరికరాలు, అనుబంధ రంగ వస్తువులు రాయితీపై అందజేయడం పాటు సాగుకు సంబంధించి సూచనలు, సలహాలు అందించేవారు. ప్రతి ఆర్‌బీకేలో కియోస్కో యంత్రాలు ఏర్పాటు చేయడంతో రైతులే నేరుగా ఎరువులు, పురుగు మందులకు ఇండెంట్ పెట్టుకునేవారు. ప్రతిరోజూ రైతుల రాకపోకలతో రైతుభరోసా కేంద్రాలు కళకళలాడేవి. అయితే ప్రస్తుతం ఆ పరిస్థితి కానరావడం లేదు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక రైతుభరోసా కేంద్రాలను రైతుసేవా కేంద్రాలుగా మార్చారు. రైతులకు ఎటువంటి సేవలు అందించకపోవడంతో ఆయా కార్యాలయాలు వెలవెలబోతున్నాయి. కొన్ని నెలలుగా రైతుసేవా కేంద్రాలలో డిజిటల్ కియోస్కో యంత్రాలు నిరుపయోగంగా మారాయి. దీంతో రైతుల నుంచి విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. కియోస్కో యంత్రాలు ఆండ్రాయిడ్ సాంకేతిక పరిజ్ఞానంతో నడుస్తాయి. ఎరువులు, పురుగు మందులు, ఇతర వస్తువులు ఆన్‌లైన్‌లో బుక్ చేసుకొనే సౌకర్యంతో పాటు పంట యాజమాన్య పద్ధతులపై సమాచారాన్ని వీడియో రూపంలో పొందుపరిచారు. వాతావరణం సూచనలు, ఏ సమయంలో ఏ పంట వేయాలన్న సమగ్ర సమాచారాన్ని ఇందులో పొందపరిచి రైతులకు తెలియజేసేవారు. ప్రస్తుతం ఆ పరిస్థితి లేకపోవడంతో రైతులు ఇబ్బంది పడుతున్నారు.

రైతే సేవాకేంద్రాల వివరాలు	
మండలం	రైతుసేవా కేంద్రాలు
పూసపాటిరేగ	19
భోగాపురం	11
డెంకాడ	16
నెల్లిమర్ల	18

ప్రభుత్వ నిర్లక్ష్యం..

కూటమి ప్రభుత్వం ఏర్పాటైన తర్వాత రైతుసేవా కేంద్రాలలో కియోస్కో యంత్రాలు నిరుపయోగంగా మారాయి. కనీసం ఎరువులు బుక్ చేసుకునేందుకు కూడా వినియోగించకపోవడంతో లక్షల రూపాయల ప్రజాధనం వృథా అవుతోంది. తప్పనిసరి పరిస్థితుల్లో రైతులు ప్రైవేట్ డీలర్ల వద్ద అధిక ధరలకు ఎరువులు కొనుగోలు చేస్తున్నారు. పాలకులు, అధికారులు స్పందించి రైతుసేవా కేంద్రాల ద్వారా రైతులకు ఎరువులు, పురుగు మందులు అందేలా చర్యలు తీసుకోవాలని రైతులు కోరుతున్నారు.



డిజిటల్ కియోస్కో యంత్రం

కనీసం ఎరువులైనా అందించాలి..

రైతుసేవా కేంద్రాల ద్వారా ఎరువులైనా పూర్తిస్థాయిలో రైతులకు అందించాలి. ఈ ఖరీఫ్‌లో రైతులకు అవసరమైన ఎరువులు, పురుగు మందులు అందించలేదు. దీంతో ప్రైవేట్ డీలర్ల వద్ద కొనుగోలు చేశాం. గతంలో ఆర్‌బీకేలు బాగా పని చేసేవి. ఇప్పుడా పరిస్థితి లేదు. – కె. వెంకటరావు, రైతు, బూడివీధి, పూసపాటిరేగ

మా ఆకలి బాధలు పట్టించుకోండి..

- 108 ఉద్యోగుల సంఘ జిల్లా అధ్యక్షుడు అప్పలనాయుడు

విజయనగరం ఫోర్ట్: మూడు నెలలుగా జీతాల్లేక ఇబ్బంది పడుతున్నామని.. మా ఆకలి బాధలు పట్టించుకోవాలని 108 ఉద్యోగుల సంఘ జిల్లా అధ్యక్షుడు వేమలి అప్పలనాయుడు అన్నారు. ఈ మేరకు శనివారం స్థానిక సర్వజన ఆస్పత్రి అంబులెన్స్ వద్ద నల్ల బ్యాడ్జీలతో నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సమయానికి జీతాలు అందక ఇబ్బంది పడుతున్నామన్నారు. కుటుంబ పోషణకు అప్పులు చేస్తున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. మూడు నెలలుగా జీతాలు అందకపోతే ఎలా బతకాలని ప్రశ్నించారు. కార్యక్రమంలో 108 ఉద్యోగులు సిరిపురపు సతీష్‌కుమార్, వెంకటరావు, కల్యాణ్, రామకృష్ణ పాల్గొన్నారు.



నిరసన తెలియజేస్తున్న 108 ఉద్యోగులు

స్టేట్ యూత్ ఫెస్ట్‌కు అర్హత

శృంగవరపుకోట: స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాల విద్యార్థులు స్టేట్ యూత్ ఫెస్టివల్‌లో పాల్గొనే అవకాశం దక్కించుకున్నారు. జిల్లా నెహ్రూ యువజన కేంద్రం, యువజన సర్వీసులశాఖ నేతృత్వంలో ఇటీవల నిర్వహించిన యూత్ ఫెస్టివల్‌లో స్థానిక డిగ్రీ కళాశాల విద్యార్థులు ద్వితీయ స్థానం సాధించి రూ.5 వేల నగదు ప్రోత్సాహక బహుమతి అందుకున్నారని ప్రిన్సిపాల్ డాక్టర్ సీహెచ్.కేశవరావు శనివారం తెలిపారు.

వీరి ప్రతిభను గుర్తించిన యువజన సర్వీసుల శాఖ రాష్ట్ర స్థాయిలో నిర్వహించనున్న యూత్ ఫెస్టివల్‌కు జిల్లా తరఫున వీరిని పంపించనుందని వైఆర్‌సీ కో-ఆర్డినేటర్ చల్లా శ్రీనివాసరావు చెప్పారు.

ఎరుకొండలో డయేరియా తగ్గుముఖం



ఎరుకొండలో పరిస్థితిపై సమీక్షిస్తున్న మైక్రోబయోలజీ టీమ్ సభ్యులు

పూసపాటిరేగ : మండలంలోని ఎరుకొండ గ్రామంలో డయేరియా తగ్గుముఖం పట్టింది. రెండు రోజులుగా వైద్యారోగ్యశాఖ, రెవెన్యూ, పంచాయతీరాజ్, గ్రామీణ నీటిసరఫరా విభాగం అధికారులు గ్రామంలో సేవలు అందిస్తున్నారు. సర్పంచ్ గొట్టాపు అప్పలస్వామి వాటర్ ట్యాంకర్ ద్వారా తాగునీరు సరఫరా చేస్తున్నారు. జిల్లా వైద్యారోగ్యశాఖ అధికారి భాస్కరరావు, తదితరులు ఎరుకొండ, పసపాం, కొల్లాయివలస, మర్రిపేట గ్రామాలను శనివారం సందర్శించారు. ఎరుకొండ గ్రామంలో మైక్రో బయాలజీ టీమ్ సభ్యులు పర్యటించి, డయేరియా ప్రబలడానికి గల కారణాలను అన్వేషించారు. పారిశుధ్యం, తాగునీటి సరఫరా, కల్తీ ఆహారం, పైప్‌లైన్ లీకేజీలపై ఆరా తీశారు. ఈ సందర్భంగా డీఎంహెచ్‌ఓ భాస్కరరావు మాట్లాడుతూ, గ్రామంలో పూర్తిస్థాయిలో డయేరియా తగ్గుముఖం పట్టినా వారం రోజులు పాటు వైద్యశిబిరం నిర్వహిస్తామన్నారు. వారితో పాటు జిల్లా పంచాయతీ అధికారి వెంకటేశ్వరరావు, తహసీల్దార్ తాడ్డి గోవింద, ఎంపీడీఓ ఎం. రాధిక, పూసపాటిరేగ వైద్యాధికారి రాజేష్‌వర్మ, వైద్యాధికారి సుబ్రహ్మణ్యం, ఈఓపీఆర్‌డీ జ్ఞానేశ్వరరావు, వైద్య సిబ్బంది ఆర్‌వీ రమణ, జి. బంగారుబాబు, ప్రజాప్రతినిధులు మహంతి చిన్నంనాయుడు, మహంతి శంకరరావు, జి. అప్పలస్వామి, తదితరులు ఉన్నారు.



రోగులతో మాట్లాడుతున్న డీఎంహెచ్‌ఓ భాస్కరరావు, తదితరులు

పాడిరైతుల నిరసన



నిరసన వ్యక్తం చేస్తున్న పాడి రైతులు

నెల్లిమర్ల రూరల్: మండలంలోని మొయిద విజయరాంపురంలో పలువురు పాడి రైతులు శనివారం నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ, 1989 నుంచి విశాఖ డెయిరీకి పాలు అందజేస్తున్నామని, అప్పటి నుంచి లీటర్ పాలకు ఎంతో కొంత ధరను పెంచుతూ తమకు లబ్ధి చేకూర్చారన్నారు. గత నెల 15వ తేదీ నుంచి లీటరు పాల ధరపై ఏకంగా రూ.5 తగ్గించారని, దీంతో ఆర్థికంగా ఇబ్బంది పడుతున్నామని చెప్పారు. సుమారు 600 మంది రైతులు విశాఖ డెయిరీకి పాలు పోస్తున్నామని, న్యాయం చేయకపోతే ప్రైవేట్ డెయిరీలకు పాలు పోయాల్సి ఉంటుందన్నారు. ప్రభుత్వం స్పందించి డెయిరీ ప్రతినిధులతో సంప్రదింపులు జరిపి తమకు న్యాయం చేయాలని కోరారు.

ఇంట్లోకి చొరబడిన కొండచిలువ



కొత్తవలస: తుమ్మికాపల్లి గేటు సమీపంలోని జనార్దన్ నగర్ కాలనీలో శుక్రవారం రాత్రి కొండ చిలువ హల్‌చల్ చేసింది. కాలనీలోని ఓ ఇంట్లోకి కొండచిలువ చొరబడింది. ఇంట్లో వ్యక్తులు భయంతో వణికిపోయారు. వెంటనే సమీపంలోని వినాయక్‌నగర్‌లో ఉంటున్న పాములు పట్టే నాగుబిల్లి సత్యనారాయణకు సమాచారం అందించారు. ఆయన అక్కడికి చేరుకుని కొండ చిలువను పట్టి ఒక గోనెసంచిలో వేసి ఊరికి దూరంగా ఉన్న తుప్పల్లో విడిచి పెట్టడంతో కాలనీవాసులు ఊపిరి పీల్చుకున్నారు.

రాష్ట్ర స్థాయి సాఫ్ట్ టెన్నిస్ బాల్ పోటీలకు ఎంపిక



ఎంపికైన విద్యార్థులతో ఉపాధ్యాయులు

బొండపల్లి: రాష్ట్ర స్థాయి స్కూల్‌గేమ్ సాఫ్ట్ టెన్నిస్ బాల్ పోటీలకు గొట్లాం హైస్కూల్ నుంచి ఆరుగురు విద్యార్థులు ఎంపికయ్యారని హెచ్‌ఎం బి.శ్రీరామాచారి శనివారం తెలిపారు. బొబ్బిలిలోని చింతాడ హైస్కూల్‌లో నిర్వహించిన జిల్లాస్థాయి పోటీల్లో పాఠశాల విద్యార్థులు ఉత్తమ ప్రతిభ కనబరిచారని చెప్పారు. అండర్-17 విభాగంలో పి.వెంకట స్వామి, పి.జావేద్, బి.యశ్వంత్, ఏ.సుశాంత్, అండర్-14 విభాగంలో పి.ధనుష్, జి.దుర్గాప్రసాద్ రాష్ట్రస్థాయి పోటీలకు జిల్లా తరఫున అర్హత సాధించారు. ఈనెల 6,7వ తేదీల్లో కడపలోని పులివెందులలో నిర్వహించే రాష్ట్రస్థాయి పోటీల్లో వీరు పాల్గొననున్నారు. విద్యార్థులను హెచ్‌ఎంతో పాటు పీడీలు యు.సత్యానంద్, ఎల్.వి.రమణ, ఉపాధ్యాయులు అభినందించారు.

ఎరువుల సరఫరాలో విఫలం

గుర్ల: ఖరీఫ్ సీజన్‌కు సంబంధించి రైతులకు రైతు సేవా కేంద్రాల ద్వారా ఎరువుల సరఫరా చేయడంలో వ్యవసాయ అధికారులు విఫలమయ్యారని మండల పరిషత్ సభ్యులు ఆగ్రహం వ్యక్తం చేశారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ పొట్నూరు ప్రమీల అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం శనివారం నిర్వహించారు. అధికారులు శాఖల వారీగా ప్రగతి నివేదికలు చదివి వినిపించారు. ఏఓ ఎం.తిరుపతిరావు వ్యవసాయ శాఖకు సంబంధించి సభకు వివరిస్తుండగా పలుగ్రామాల సర్పంచ్‌లు, ఎంపీటీసీలు స్పందించారు. ఖరీఫ్ సీజన్‌లో సకాలంలో ఎరువులు అందక రైతులు ఇబ్బందులు పడ్డారని, ప్రైవేటు దుకాణాల నిర్వాహకులు కృత్రిమ కొరత సృష్టించారన్నా రు. గూడెం గ్రామ ప్రాథమిక పాఠశాలలో మధ్యాహ్న భోజన పథకం నిర్వాహకులు ఎలాంటి తప్పు చేయక పోయినా తొలగించారని, ఇది సబబు కాదని వైస్ ఎంపీపీ తోట తిరుపతిరావు ఎంఈఓ భానుప్రకాష్‌ను నిలదీశారు. ఎంఈఓ స్పందిస్తూ మండల కమిటీ సిఫార్సుల ఆదారంగా తొలగించామని వివరణ ఇచ్చారు. మండలంలోని డయేరి యా ప్రభావిత గ్రామాల్లో దాదాపుగా 20 రోజులుగా ట్యాంకర్ల ద్వారా ప్రజలకు తాగునీరు అందిస్తున్నామని గుర్ల, గూడెం సర్పంచ్‌లు అధికారుల దృష్టికి తీసుకువచ్చారు. ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ కిశోర్ స్పందిస్తూ సాలిపిసోమరాజుపేట వద్ద ఉన్న రక్షిత మంచినీటి పథకం నుంచి మరో మూడు రోజుల్లో కుళాయిల ద్వారా తాగునీరు సరఫరా చేస్తామని చెప్పారు.

ప్రత్యేక పూజలు..



విజయనగరం జిల్లా కేంద్రంలో కార్తీకమాసం పూజలు ప్రారంభమయ్యాయి. పశుపతి నాథేశ్వర స్వామి ఆలయంలో స్పటిక లింగానికి శివలింగానికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో అధిక సంఖ్యలో భక్తులు పాల్గొనగా... అర్చకులు తీర్థ,ప్రసాదాలు అందజేశారు.

– సాక్షి ఫొటోగ్రాఫర్,విజయనగరం

సమస్యలు పరిష్కరించాలి..



ఉమ్మడి విజయనగరం జిల్లాలోని అటవీ ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలని అటవీ ఉద్యోగుల సంఘ ప్రతినిధులు కోరారు. ఈ మేరకు పార్వతీపురం డీఎఫ్‌ఓ, ఇన్‌చార్జ్ విజయనగరం డీఎఫ్‌ఓ జీపీపీ ప్రసూనను శనివారం స్థానిక ఫూల్‌బాగ్‌లోని జిల్లా అటవీశాఖ కార్యాలయంలో కలిసి వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో యూనియన్ అధ్యక్షుడు ఎం. మనోజ్, కార్యదర్శి కేవీఎన్ రాజు, ఉపాధ్యక్షురాలు ఎం. భారతి, కోశాధికారి ఎం. రమేష్, అవతారం, తదితరులు పాల్గొన్నారు.

– విజయనగరం ఫూల్‌బాగ్

వినతి..



వీఆర్‌ఏలకు పే స్కేల్ అమలు చేయాలని సీఐటీయూ నాయకుడు బి. సూర్యనారాయణ డిమాండ్ చేశారు. శనివారం స్థానిక రెవెన్యూ కార్యాలయంలో తహసీల్దార్ తాడ్డి గోవిందను కలిసి వినతి పత్రం అందజేశారు. అర్హులైన వీఆర్‌ఏలకు ప్రమోషన్లు ఇవ్వాలని.. నైట్ వాచ్‌మన్, ఇసుక రీచ్ వద్ద డ్యూటీలు రద్దు చేయాలని కోరారు. కార్యక్రమంలో పలువురు వీఆర్‌ఏలు పాల్గొన్నారు.

– పూసపాటిరేగ

అదే నిర్లక్ష్యం..!



ప్రభుత్వ సర్వజన ఆస్పత్రి సిబ్బంది తీరు మారడం లేదు. అధికారులు హెచ్చరించినప్పటకీ వారి ప్రవర్తనలో మార్పు రాకపోగా.. ఇంకా రోగుల పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారు. బంటుపల్లికి చెందిన చిన్నా అనే వ్యక్తికి కొద్ది రోజుల కిందట శస్త్రచికిత్స జరిగింది. శనివారం అతని బంధువులు డ్రెస్సింగ్ చేయడానికి సర్వజన ఆస్పత్రికి రోగిని తీసుకొచ్చారు. ఆపరేషన్ జరగడం వల్ల చిన్న నడవలేని స్థితిలో ఉన్నాడు. డ్రెస్సింగ్ గది వద్దకు అతన్ని తీసుకెళ్లడానికి వైద్య సిబ్బంది అందుబాటులో లేకపోవడంతో అతని బంధువులే వీల్‌చైర్‌పై తీసుకువెళ్లారు. ఇటువంటి సంఘటనలు తరచూ జరుగుతుండడంపై విమర్శలు వినిపిస్తున్నాయి.

– విజయనగరం ఫోర్ట్

అభినందనలు..



అలుగోలు ఉన్నత పాఠశాలలో పదో తరగతి చదువుతున్న నక్కెళ్ల గంగరాజు జాతీయ స్థాయి కబడ్డీ పోటీలకు ఎంపికయ్యాడు. గత నెల 27 నుంచి మూడు రోజుల పాటు కడప జిల్లాలో స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో జరిగిన రాష్ట్ర స్థాయి కబడ్డీ పోటీల్లో ఉత్తమ ప్రతిభ కనబరిచి జాతీయ స్థాయి పోటీలకు అర్హత సాధించాడు. ఈ నెల 14 నుంచి 17 వరకు మధ్యప్రదేశ్‌లో జరగనున్న జాతీయ స్థాయి పోటీలల్లో గంగరాజు పాల్గొంటాడు. ఈ మేరకు గంగరాజును పాఠశాల హెచ్‌ఎమ్ జీఎస్ కాంతారావు, వైస్ ఎంపీపీ సారిక వైకుంఠంనాయుడు శనివారం అభినందించారు. కార్యక్రమంలో వ్యాయామ ఉపాధ్యాయుడు సూర్యారావు, సిబ్బంది పాల్గొన్నారు.

– నెల్లిమర్ల రూరల్